

రంజాన్ వేళలు	ఇఫ్తార్ (మంగళ)	సా.6.25
	సహరి (బుధ)	ఉ.4.34

విద్యార్థులతో వెళుతున్న ఆటో బోల్తా
- 7లో

పిఠాపురం.. ఇక నా స్వస్థలం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

- ఏదో ఒక గ్రామంలో ఇల్లు తీసుకుంటా
- నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధి నా బాధ్యత
- ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్
- జనసేనలో భారీగా చేరికలు

పిఠాపురం, ఏప్రిల్ 1: 'పిఠాపురాన్ని నా స్వస్థలం చేసుకోవడానికే ఇక్కడకు వచ్చా. నియోజకవర్గంలోని 54 గ్రామాల్లో ఏదో ఒకచోట ఇల్లు తీసుకుని ఉంటా. నన్ను ఒక్కసారి గెలిపించమని భగవంతుడిని కోరితే పిఠాపురం పిలిచింది. మనం భారీ మెజార్టీతో గెలవబోతున్నామ'ని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో పిఠాపురం నియోజకవర్గానికి చెందిన ప్రముఖ వైద్యులు, న్యాయవాదులు, వివిధ వర్గాల ప్రముఖులు, వైసీపీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీల చైర్మన్లు, నాయకులు జనసేన పార్టీలో చేరారు. వారందరికీ పవన్ జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పిఠాపురం నియోజకవర్గంలోని అందరినీ వ్యక్తిగతంగా కలవాలన్న ఆశ తనకు ఉన్నప్పటికీ భద్రతాపరమైన కారణాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పవన్ తెలిపారు. ప్రత్యర్థుల పన్నాగాలు గమనిస్తూ మనమంతా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని చెప్పారు. భద్రతాపరమైన ప్రొటోకాల్ పాటిస్తూ రోజుకి 200 మందిని కలిసి వారితో ఫొటోలు తీసుకుంటానని తెలిపారు. శ్రీపాదశ్రీవల్లభుడు, పురుహూతికా అమ్మవారు, బషీర్ బీబీ (బంగారు పాప) దర్గా, ఆంధ్రా బాప్టిస్టు చర్చి సాక్షిగా ప్రజలందరికీ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. తాను భగవంతుడినీ ఏదీ కావాలని కోరుకోనని, అయితే సినిమాలు వరుసగా ఫ్లాప్ అవుతున్న సమయంలో నల్గొండకు చెందిన అభిమాని వచ్చి ఒక్క హిట్ ఇవ్వు అన్నా అని అడిగాడు. అప్పుడు ఒక్క హిట్ ఇవ్వమని, భీమవరంలో ఓడిపోయిన తర్వాత గెలుపు ఇవ్వమని భగవంతుడిని కోరానని, ఆ మేరకు తనను పిఠాపురం పిలిచిందని చెప్పారు. నియోజకవర్గంలో ఏ ప్రాంతంలో ఉండాలన్నదీ త్వరలో నిర్ణయించుకుంటాని, పురుహూతికా అమ్మవారి ఆశీస్సులతో ఇక్కడే ఏదో ఒక గ్రామంలో ఇల్లు తీసుకుని ఉంటానన్నారు. పగిలే గాజు గ్లాసుకు పదును ఎక్కువన్నారు. అందరినీ ప్రత్యేకించి కలుస్తానని, ప్రతి ఒక్కరి సమస్యలనూ తెలుసుకుంటానని తెలిపారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని చెప్పారు. అందుకు కాకినాడ ఎంపీ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్ నిదర్శనమన్నారు. వచ్చే 25 సంవత్సరాల్లో కొత్తతరం నాయకులు ముందుకు రావాలని కోరారు. ఇప్పటి నుంచీ నిలబడితేనే రేపటి రోజున నాయకులు తయారవుతారని తెలిపారు. జనసేన పార్టీ నియోజకవర్గ స్థాయి నుంచి మండల, గ్రామస్థాయి వరకు నాయకులను తయారు చేస్తుందని చెప్పారు. కాకినాడ ఎంపీ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు బి.మహేందరరెడ్డి, ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులు వేములపాటి అజయకుమార్, పి.హరిప్రసాద్, మర్రెడ్డి శ్రీనివాస్, కె.శరత్, కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కల్యాణం శివ శ్రీనివాస్, తెలంగాణా ఇన్‌చార్జి ఎస్.శంకరగౌడ్, మాజీ ఎంపీపీ కురుమళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా పిఠాపురం నియోజకవర్గం, ఇతర ప్రాంతాల ప్రముఖులు పవన్ సమక్షంలో జనసేనలో చేరారు. వారిలో ప్రముఖ వైద్యురాలు డాక్టర్ వరలక్ష్మి, న్యాయవాదులు సూరవరపు వెంకటేశ్వరరావు, త్రినాథ్, వెంకటరమణ, అరుణ్‌బాబు, కన్నా ఆశ్రయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ గండి శకుంతలాదేవి, వంతల నందీశ్వరి, సూరవరపు సురేష్, మారిశెట్టి బుజ్జి, ఊటా సత్యనారాయణ, ఎలుబండి ప్రభ, డాక్టర్ ఆర్.మోహనరావు, కోడిగుడ్డి రాజేష్, గారపాటి శ్రీనివాసరావు, బస్వా ప్రసాద్, మేరుగు జగదీష్, ఎండీ జాఫర్ షరీఫ్, షేక్ ఖాదీర్, నజీర్, అబ్దుల్ ఖయూమ్, లోకారెడ్డి రామకృష్ణ, బొజ్జా లోవరాజు, యా పాటి అరుణ్‌బాబు, కుక్కా శ్రీను ఉన్నారు.





పిఠాపురంలో జనసేన పార్టీలో చేరిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ వరలక్ష్మి... కన్నా ఆశ్రయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ గండి శకుంతలాదేవి

నేటి పర్యటన ఇలా..

సోమవారం మధ్యాహ్నం 1.40 గంటలకు గొల్లప్రోలులోని హెలిపాడ్‌కు చేరుకున్న పవన్‌కల్యాణ్ సాయంత్రం 5.15 గంటలకు గొల్లప్రోలు హెలిపాడ్ నుంచి హైదరాబాదుకు హెలికాప్టర్‌లో పయనమయ్యారు. ఆయన తిరిగి మంగళవారం నియోజకవర్గానికి వస్తారు. ఉదయం 9 గంటలకు హెలిపాడ్ నుంచి బయలుదేరి పిఠాపురంలోని ఏబీసీ (ఆంధ్ర బాప్టిస్ట్ చర్చ్)కు, తర్వాత కొత్తపల్లి మండలం పొన్నాడలోని బషీర్‌బీబీ దర్గా (బంగారు పాప)లకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. తర్వాత యు కొత్తపల్లి మండలం కొత్తపల్లిలోని సురక్ష ప్యాలెస్ ఫంక్షన్ హాలులో మహిళలతో సమావేశంలో పాల్గొంటారు. అక్కడ నుంచి పిఠాపురం చేరుకుని వివిధ జంక్షన్లలో పర్యటిస్తారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని జనసేన కార్యాలయం ఒక ప్రకటనలో కోరింది.

జనసేనలో చేరిన మండలి బుద్ధప్రసాద్

పిఠాపురం, ఏప్రిల్ 1: జనసేన పార్టీలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు చేరేందుకు పిఠాపురం వేదిక అయ్యింది. పిఠాపురం మండలం కుమారపురం గ్రామంలోని గోకులం గ్రాండ్ హోటల్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే, అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, పాలకొండ నియోజకవర్గానికి చెందిన నిమ్మక జయకృష్ణ, రైల్వేకోడూరు నియోజకవర్గం సర్పంచ్ శ్రీధర్ పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ పవన్ సాదర స్వాగతం పలికారు. పార్టీలో చేరిన అనంతరం మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గం నుంచి పోటీకి నిలవమని పవన్ తనను కోరగా చంద్రబాబు మద్దతు ఇచ్చారన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో ఏపీలో జరగని అరాచకం లేదని మండిపడ్డారు. వేల కోట్ల దోపిడీ జరిగిందని ఆరోపించారు. తెలుగు భాషాభివృద్ధికి తాను చేసిన కృషిని పవన్ ఎన్నోసార్లు మెచ్చుకున్నారని ఆయన గుర్తు చేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా పాలకొండ నియోజకవర్గానికి చెందిన నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ తనకు సీటు వస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. పాలకొండలో వైసీపీ నాయకుల అక్రమాలు దారుణంగా ఉన్నాయని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు.












పిఠాపురం నియోజకవర్గంలో జనసేనలో చేరిన పలువురు నేతలు





రావులపాలెంలో చంద్రబాబు సభ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కూటమి నాయకులు

రేపటి నుంచి చంద్రబాబు ప్రజాగళం

- రేపు రావులపాలెం, రామచంద్రపురంలలో సభలు
- 4న గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల్లో పర్యటన
- అనంతరం 'పశ్చిమ'కు పయనం - వేడెక్కిన రాజకీయం

రావులపాలెం/అమలాపురం/నల్లజర్ల/ రాజమహేంద్రవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజాగళం పేరుతో ఎన్నికల ప్రచారం సాగిస్తున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి గోదావరి జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. ఆయన కొత్తపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు కోనసీమ ముఖద్వారమైన రావులపాలెంలో చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు, జోన్-2 ఇన్‌చార్జి సుజయ కృష్ణరంగారావు, పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీశ్‌మాధుర్, జనసేన కొత్తపేట ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, బీజేపీ పదాధికారి తమలంపూడి రామకృష్ణారెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ సోమవారం పరిశీలించారు. రావులపాలెం కెనాల్ రోడ్డులో బహిరంగ సభా స్థలి ప్రదేశం, మల్లాయిదొడ్డిలో హెలిపాడ్ ఏర్పాటు, అక్కడకు సమీపంలో ఉన్న ఓ ఫంక్షన్ హాలులో ముఖ్య నేతలతో మాట్లాడేందుకు వీలుగా ఉన్న కల్యాణ మండపాన్ని పరిశీలించారు. రావులపాలెం సభ అనంతరం రామచంద్రపురం పర్యటనకు చంద్రబాబు హెలికాప్టర్‌లో వెళతారని సమాచారం. రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని ద్రాక్షారామలో బుధవారం సాయంత్రం జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు రెండు నియోజకవర్గాల్లో చంద్రబాబు పర్యటన కొనసాగుతుందని టీడీపీ నేతలు పేర్కొంటున్నారు. రాత్రికి రామచంద్రపురంలో బసచేసే అవకాశం ఉంది. ఈ మేరకు నాయకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, గోపాలపురం ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 4వ తేదీ గురువారం పర్యటిస్తారు. గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం స్థల సేకరణ పనిలో టీడీపీ నాయకులు నిమగ్నమయ్యారు. నల్లజర్లలో లేదంటే గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో బహిరంగ ఏర్పాటుచేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. కొవ్వూరులోనూ ఏర్పాట్లు చేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు, పాలకొల్లు నియోజకవర్గాల్లో 5వ తేదీన పర్యటించనున్నారు. ఇప్పటికే జనసేన అధినేత పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా పరిధిలోని పిఠాపురంలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆయన రాకతో రాజకీయం వేడెక్కింది. టీడీపీ అధినేత చంద్రబాబు కూడా రానుండడంతో కూటమిలో మరింత జోష్ పెరగనుంది. ఈనెల 5 నుంచి రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి బరిలో దిగనున్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థుల ప్రకటన

- కాకినాడ ఎంపీ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు
- రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిగా గిడుగు రుద్రరాజు
- ఖరారు చేసిన కాంగ్రెస్ అధిష్ఠానం

- 7లో

ఇంటి వద్దే వృద్ధుల ఓటింగ్‌కు ప్రణాళికలు సిద్ధం

నియమావళి ప్రకారం పోస్టల్ బ్యాలెట్ : కలెక్టర్ జె.నివాస్



జేఎన్టీయూకేలోని స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నివాస్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 1: సార్వత్రిక ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటువేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశామని కలెక్టర్ జె.నివాస్ వెల్లడించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ముకేష్‌కుమార్ మీనా విజయవాడ కార్యాలయం నుంచి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్, ఇంటి నుంచే ఓటింగ్, పోలింగ్ విధులు నిర్వహిస్తున్న పీవోలు, ఏపీవోలు, ఎన్నికల సిబ్బంది శిక్షణా కార్యక్రమాలు, ఎన్నికల సన్నద్ధత వంటి అంశాలపై మీనా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ఎన్నికల సంఘాల సూచనల ప్రకారం ఎన్నికల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 85 ఏళ్ల దాటిన వృద్ధులు ఇంటి వద్దే ఓటు వేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకుంటారన్నారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్వో తిప్పేనాయక్, డీపీవో భారతి సౌజన్య, సైనిక వెల్ఫేర్ అధికారి కృష్ణారావు, డీఎల్‌డీవో నారాయణమూర్తి పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన కలెక్టర్

కాకినాడ జేఎన్టీయూకేలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్‌హాలు, రిసెప్షన్ సెంటర్, వాహనాల పార్కింగ్‌లను కలెక్టర్ నివాస్ సోమవారం పరిశీలించారు. కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పెద్దాపురం, తుని అసెంబ్లీ నియోజకవర్గాల స్ట్రాంగ్‌రూమ్‌ల ఏర్పాట్లును చూశారు. జేఎన్టీయూకేలో మెకానికల్ ఇంజనీరింగ్ బ్లాక్, సివిల్ ఇంజనీరింగ్ బ్లాక్, పీజీ బ్లాక్, ఇన్నోవేషన్ రిసెప్షన్ సెంటర్లను పరిశీలించారు. ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్వోలు వెంకటరావు, కిషోర్, సీతారామారావు, రామలక్ష్మి పాల్గొన్నారు.

'పెన్షన్' రాజకీయం!



ప్రతీ నెలా ఒకటవ తేదీన ఠంచనుగా పింఛను అందజేస్తాం అని చెబుతూ వస్తున్న ప్రభుత్వం గత కొంతకాలంగా పింఛన్ల పంపిణీలో పిల్లిమొగ్గలు వేస్తోంది. ఖజానా మొత్తాన్ని ఖాళీ చేసిన ప్రభుత్వం పింఛను పంపిణీకి నిధులు దొరక్క రకరకాల కారణాలు చెబుతూ ప్రతీనెలా పింఛన్లు పంపిణీ చేయకుండా తప్పుకుంటూ వస్తోంది. కొత్త ఏడాది తొలి రోజైన జనవరి ఒకటవ తేదీన కూడా పింఛనుదారులకు ఇదే అనుభవం ఎదురయ్యింది. ఫిబ్రవరి నెలలోనూ అదే పరిస్థితి కాగా ఈనెల కూడా పింఛను పంపిణీ వాయిదా వేసింది. నిధులు లేవన్న వాస్తవాన్ని మరుగుపరిచి ఎన్నికల కమిషన్‌పైనా, ప్రతిపక్షాలపైనా నెపం మోపేందుకు ప్రయత్నిస్తోంది.

- ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం
- సచివాలయాల వద్ద ఇచ్చేందుకు ఏర్పాట్లు
- నిధులు లేక వాయిదా వేసిన ప్రభుత్వం
- ప్రతిపక్షాల మీద విషం చిమ్మడమే లక్ష్యంగా ప్రచారం

పెద్దాపురం, ఏప్రిల్ 1: వైసీపీ ప్రభుత్వానికి తమ వైఫల్యాల్ని కప్పిపుచ్చి ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేయడం కొత్తేమీ కాదు. ఎన్నికల వేళ కూడా ఇదే వైఖరితో పింఛను పథకాన్ని వాడుకుంటోంది. చివరకు ఎన్నికల కమిషన్‌ను కూడా ఈ విషయంలో తప్పు పట్టేందుకు వెనుకాడడం లేదు. ఇంటికొచ్చే పింఛన్లను ఇవ్వనీయకుండా అడ్డుకున్నారంటూ ఆ పార్టీ ఎడాపెడా దుష్ప్రచారానికి దిగింది. నిజానికి నిధులు లేక పింఛను పంపిణీకి ఆటంకం ఏర్పడగా, సకాలంలో ఇవ్వకపోవడానికి కారణం ప్రతిపక్షాలే అని ఎదురుదాడి చేసేందుకు ప్రభుత్వం పూనుకుంటోంది. ప్రతిపక్షాలు వలంటీర్లపై ఫిర్యాదుచేసి వారిని పింఛను పంపిణీకి రాకుండా అడ్డుకున్న కారణంగా పింఛన్ల పంపిణీ ఆగిపోయిందనేవిధంగా ప్రచారం సాగిస్తున్నారు. వారివల్లే పింఛన్ల పంపిణీలో పూర్తిగా ఆగిపోయి నగదు అందకుండా పోతోందని కొన్నిచోట్ల ప్రతిపక్షాలపై విషం చిమ్మే ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ ప్రభుత్వోద్యోగులతో పంపిణీ చేయించాలని చెప్పిన విషయాన్ని మరుగునపెట్టి లబ్ధిదారులను వంచించేందుకు ప్రయత్నిస్తున్నారు. లబ్ధిదారులను ఆందోళనకు గురిచేయడం ద్వారా ప్రతిపక్షాల పట్ల వారిలో వ్యతిరేకతను తీసుకురావచ్చని అధికారపక్ష నేతలు భావిస్తున్నారు. అందుకోసం పింఛన్ల పంపిణీని సచివాలయాలకు పరిమితం చేశారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా డోర్ డెలివరీ చేయకుండా పింఛన్‌దారులనే సచివాలయాలకు రప్పించి అక్కడ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తద్వారా అక్కడ పడిగాపులుపడే లబ్ధిదారుల్లో ప్రతిపక్షాల పట్ల వ్యతిరేకభావం కలిగేలా చేయాలని చూస్తున్నారని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. నిధులు లేక పంపిణీ ఆగిందన్న విషయం గ్రహించిన లబ్ధిదారులు వలంటీర్లతో చేయిస్తున్న ప్రచారాన్ని పట్టించుకోవడం లేదు.

బ్యాంకులకు సెలవులంటూ బుకాయింపులు

మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగిసి ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం మొదలవుతుంది. బ్యాంకు లావాదేవీల ముగింపు కారణంగా సకాలంలో పింఛన్లు ఇవ్వలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. ఇందులో వాస్తవం లేదని తెలుస్తోంది. పింఛన్లు ఏప్రిల్ ఒకటవ తేదీ సోమవారం నుంచి పంపిణీ చేయాల్సిన నేపథ్యంలో శనివారం, ఆదివారం సెలవులు కాబట్టి నిధులను ప్రభుత్వం శుక్రవారం నాటికే బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేయాలి. ఇలా చేయలేదని చెబుతున్నారు. పైగా ఆఖరి శనివారం, ఆదివారం కూడా బ్యాంకులు పనిచేశాయి. కాగా ఇప్పుడు సోమవారం బ్యాంకులకు సెలవు అయినందు వల్ల మూడవ తేదీకి వాయిదా వేస్తున్నామని చెబుతున్నారు.



నకిలీ పొజిషన్ పట్టాలను చూపిస్తున్న కూటమి ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ

ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తున్న కన్నబాబు

నకిలీ పట్టాల పంపిణీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 1: నకిలీ పొజిషన్ పట్టాల అవినీతి బాగోతం, అవకతవకలపై సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కాకినాడ రూరల్ జనసేన-టీడీపీ అభ్యర్థి పంతం నానాజీ డిమాండ్ చేశారు. సోమవారం వలసపాకల గంగరాజునగర్ జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూరల్ నియోజకవర్గం పరిధిలోని 42వ డివిజన్ స్వామినగర్‌లో టీడీపీ ప్రభుత్వ హయాంలో 112 సర్వే నెంబర్‌లో 63 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజల తాగునీటి, సామాజిక అవసరాల కోసం స్థలం సుమారు 560 చదరపు గజాల స్థలాన్ని కేటాయించిందన్నారు. 2019 తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు హయాంలో నలుగురు ఏకమై ప్రజావసరాలకు కేటాయించిన స్థలాలతోపాటు ఇరిగేషన్ కాలువ గట్టుపై అనధికారికంగా 55 నకిలీ పొజిషన్ నకిలీ పట్టాలు సృష్టించి అనర్హులకు లక్షలాది రూపాయలకు అమ్మేసుకున్నారని ఆరోపించారు. కొందరి నుంచి డబ్బులు తీసుకుని స్థలాలు ఇవ్వకపోవడంతో బాధితులు గతంలో ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. డబ్బులు తీసుకున్న స్థానిక నాయకుడు నకిలీ పట్టాలు తయారుచేసి ఇచ్చారన్నారు. లేని స్థలంలో పొజిషన్ పట్టాలు ఇవ్వడంతో స్థానికులు సమాచార హక్కు చట్టం ప్రకారం గ్రామంలో జారీచేసిన పొజిషన్ పట్టాల సమాచారం ఇవ్వాలని గత తహశీల్దార్ మురార్జీని వివరణ కోరగా, ఎటువంటి పొజిషన్ పట్టాలు జారీచేయలేదని తహశీల్దార్ రాతపూర్వకంగా ఇవ్వడంతో నకిలీ పట్టాల బాగోతం వెలుగు చూసిందన్నారు. నకిలీ పట్టాలతో అడ్డగోలుగా హౌసింగ్ స్కీమ్‌తో ఇల్లు నిర్మించుకున్నారన్నారు. ఎన్నికల నేపథ్యంలో నకిలీ పట్టాలిచ్చి ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే పనిలో ఎమ్మెల్యే కన్నబాబు ఉన్నారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ నాయకులు ఎల్లుటి లక్ష్మీనారాయణ, పాలిక రమణ, మాచవరపు సత్యనారాయణ, గవర శ్రీరాములు పాల్గొన్నారు.



ట్యాంకర్ పేలడంతో అక్కడికక్కడే మృతి చెందిన ప్రభాకర్, శామ్యూల్

క్షణంలో ఘోరం

ట్యాంకర్ పేలి ఇద్దరు దుర్మరణం

- 7లో

గుమ్మరేగుల్లో ఆరుగురు వలంటీర్లు రాజీనామా

రౌతులపూడి, ఏప్రిల్ 1: రౌతులపూడి మండలం గుమ్మరేగుల గ్రామానికి చెందిన ఆరుగురు వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. ఈ లేఖను స్థానిక పంచాయతీ కార్యదర్శికి అందజేశారు.

వైసీపీ ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు

తాళ్లరేవు, ఏప్రిల్ 1: వైసీపీ గోవలంకలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు సోమవారం ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇద్దరు వలంటీర్లు కాశీ ఏడుకొండలు, పోతుల పవన్‌కుమార్ వైసీపీ జెండాతో ద్విచక్రవాహనంపై గ్రామంలో తిరిగారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా వలంటీర్లుకు ప్రభుత్వం అనేకసార్లు చెబుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

మాతా శిశు మరణాలను తగ్గించడమే లక్ష్యంగా పనిచేయాలి : డీఎంహెచ్‌వో



సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్

జీజీహెచ్ (కాకినాడ) ఏప్రిల్ 1: మాతా, శిశు మరణాలను గణనీయంగా తగ్గించేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి వైద్యాధికారుల వరకు ప్రతి ఒక్కరు సమష్టిగా కృషిచేయడం లక్ష్యంగా పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ పిలుపునిచ్చారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆయన సోమవారం వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోని గర్భిణిలు, బాలింతలు, చంటిబిడ్డల విషయంలో ఆశా, అంగన్వాడీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ గర్భిణిలు హైరిస్క్ ప్రెగ్నెన్సీ బారినపడకుండా వారికి సంపూర్ణ పోషకాహారం, మందులు అందేవిధంగా చర్యలు చేపడితే మాతా, శిశు మరణాలకు తావుండదని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. డీఐవో డాక్టర్ కె రత్నకుమార్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ స్వప్న, జీజీహెచ్ వైద్య నిపుణులు పాల్గొన్నారు.



మాక్ పోలింగ్ తప్పనిసరి

సామర్లకోట, ఏప్రిల్ 1: గత ఎన్నికలతో పోలిస్తే ఈ దఫా ఎన్నికల నిబంధనల అమలులో కొన్ని మార్పులు తీసుకొచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రతీ పోలింగ్ కేంద్రంలోనూ పోలింగ్ ప్రారంభానికి గంటన్నర ముందుగా మాక్ పోలింగ్ నిర్వహించి పోలింగ్‌కు సన్నద్ధం చేయాలి. రీ పోలింగ్‌కు ఎక్కడా అవకాశం రాని రీతిలో పీవోలు అప్రమత్తంగా వ్యవహరించాలి. ఏమాత్రం విధుల్లో పొరపాట్లు జరిగినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవు. పోలింగ్ రోజున వీలైనంత వేగంగా పోలింగ్ జరిగేలా చర్యలు చేపట్టాలి. ఒక ఓటరు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఓటు వేసి తిరిగి వచ్చేందుకు 7 నిమిషాల సమయం పడుతుంది. దానిని దృష్టిలో ఉంచుకుని ఇతర పనులు పూర్తిచేయాలి. ప్రతీ పోలింగ్ కేంద్రంలోనూ 90 నిమిషాలకు ముందు తప్పనిసరిగా మాక్‌పోలింగ్ నిర్వహించాలని, అనంతరం ఈవీఎంలను డిలీట్ చేయాలని, వీవీ ప్యాట్‌లు ఖాళీ చేసి సీల్ చేయాలి. మాక్ పోలింగ్ జరగకపోతే పోలింగ్ రద్దయ్యే అవకాశం ఉంది. ఉదయం 5.45 గంటలకు మాక్ పోలింగ్ పూర్తి కావాలని ప్రతీ పోలింగ్ కేంద్రానికి పీవోతో పాటు నలుగురు సిబ్బందిని కేటాయించారు. ఎన్నికల విధులకు ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులను మాత్రమే నియమిస్తారు. వలంటీర్లు, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు అవకాశం ఎంతమాత్రం లేదు. ఎన్నికల నిర్వహణపై శిక్షణ మూడు విడతల్లో నిర్వహించాలి.

'సోషల్' ప్రచారానికి

అనుమతి ఉండాల్సిందే





సామర్లకోట, ఏప్రిల్ 1: వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్రచారానికి కూడా ముందస్తు అనుమతి పొందాల్సిందేనని ఎన్నికల కమిషన్ నుంచి ఉత్తర్వులు ఆర్వో అధికారులకు అందాయి. ఈ మేరకు ఆంధ్రజ్యోతి గురువారం రాత్రి సమాచారాన్ని సేకరించింది. ఈ-పేపర్స్, ఫేస్‌బుక్, వాట్సాప్, యూట్యూబ్, వికీపీడియా, వర్చువల్ గేమ్ వరల్డ్, ఎస్ఎంఎస్ వాయిస్ మెసేజ్, ఎఫ్ఎం ఛానెల్స్, ఐవీఆర్ కాల్స్, సినిమా హాల్స్ ప్రకటనలు, రేడియో, బహిరంగ ప్రదేశాలలో ప్రదర్శించే ఆడియో విజువల్స్ తదితరాలు మీడియా ఎలక్ట్రానిక్స్ పరిధిలోకి వస్తాయని అధికారులు తెలిపారు. అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలకు ముందస్తు అనుమతులు పొందాలని స్పష్టం చేశారు. మీడియా సర్టిఫికేషన్ మోనిటరింగ్ కమిటీ దీనికి అనుమతులు ఇస్తుందని పేర్కొన్నారు. ముందస్తు ధ్రువీకరణ పత్రాలు పొందకుండా సోషల్ మీడియాలో ఎటువంటి ప్రచారం చేసినా ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద వస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం దగ్గర నమోదైన రాజకీయ పార్టీలు కనీసం 3 రోజుల ముందుగా జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలోని ఎంసీఎంసీ సెల్‌లో సంబంధిత అధికారికి ప్రీ సర్టిఫికేషన్ కోసం దరఖాస్తు సమర్పించాలి. నమోదు కాని రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు 7 రోజుల ముందుగా దరఖాస్తు సమర్పించాలి. ప్రచారం చేయడానికి ప్రతిపాదించిన అంశం స్క్రిప్ట్ ఎలక్ట్రానిక్ ఫార్మెట్‌ను రెండు ప్రతులలో సమర్పించాలి. దరఖాస్తుతో పాటు ప్రకటన నిర్మాణ ఖర్చు రోజుకు ఎన్నిసార్లు ప్రచారం చేస్తున్నదీ ప్రతీ ప్రచారానికి ఎంత ఖర్చు తదితర వివరాలు సోషల్ మీడియా ప్రకటనలకు తయారీ ఖర్చు సంబంధిత సిబ్బందికి చెల్లిస్తున్న వేతనాలు తదితర అంశాల వివరాలు అందించాలి. పోటీలో ఉన్న అభ్యర్థి కానీ అభ్యర్థి ధ్రువీకరించిన వ్యక్తి గాని దరఖాస్తు సమర్పించాలి. ప్రకటనలలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పూర్తిగా పాటించాలి. ప్రకటనలలో ఎటువంటి అభ్యంతరకర అంశాలు, పదాలు, వ్యాఖ్యలు ఉండరాదు. జాతి, మత, ప్రాంత, భాష, సామాజిక వర్గ విభేదాలు సృష్టించే విధంగా ఉండే అంశాలు గాని, వ్యక్తిగత దూషణలు గాని, భావోద్వేగాలు రెచ్చగొట్టే అంశాలు కానీ ఉండరాదు. పెయిడ్ న్యూస్, ఎన్నికల సమయంలో అభ్యర్థులు జారీ చేసే ప్రకటనల ఖరీదును సంబంధిత అభ్యర్థి వ్యయ ఖాతాలో జమ చేస్తారు. ప్రీ సర్టిఫికేషన్ లేకుండా ఎటువంటి ప్రకటనలను ప్రదర్శించే కేబుల్ నెట్ వర్క్‌ల ప్రతినిధులు నియమావళిని పాటించాల్సిందే. ప్రింట్ మీడియా ప్రకటనలకు కూడా అనుమతి తప్పనిసరి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ప్రచారం ముగిసిన తేదీ సాయంత్రం నుంచి పోలింగ్ రోజుకు మధ్య 48 గంటల సమయంలో కూడా అనుమతులు పొందాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలలో స్పష్టం చేశారు.

క్షణంలో ఘోరం

ట్యాంకర్ పేలి ఇద్దరు దుర్మరణం

పేలిన ట్యాంకర్ ఇదే



గొల్లప్రోలు రూరల్, మార్చి 1: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివారులోని కత్తిపూడి నుంచి రావికంపాడు వెళ్లే రోడ్డులో వెల్డింగ్ చేస్తుండగా ట్యాంకర్ పేలడంతో ఇద్దరు అక్కడికక్కడ మృతిచెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. శంఖవరం మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన గాబు గంగాధర్ తన ఆయిల్ ట్యాంకర్‌ను మరమ్మతుల నిమిత్తం అదే గ్రామంలోని సత్యాదుర్గా ఆర్క్ వెల్డింగ్ ఇంజనీరింగ్ వర్క్స్‌కు ఇచ్చారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ శివారులోని కత్తిపూడి నుంచి రావికంపాడు వెళ్లే రోడ్డులో ట్యాంకర్ వెనుక భాగంలో సోమవారం ఉదయం 9 గంటలు నుంచి వెల్డింగ్ పనులు ప్రారంభించారు. పోలవరం కాలువ పక్కనే పనులు నిర్వహిస్తున్న సమయంలో ఆయిల్ ట్యాంకర్ వెనుక భాగం పేలిపోయింది. ఆ పేలుడు తాకిడికి ట్యాంకర్ భాగాలు తగలడంతో శంఖవరం మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ బూర సోమరాజు అలియాస్ శామ్యూల్ (39), వెల్డింగ్ వర్కర్ కొంచెర్ల ప్రభాకర్ (38) అక్కడికక్కడే మరణించారు. ప్రమాదంలో వెల్డింగ్ షాపు యజమాని నున్న లోవరాజు, మరో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీలు పరిశీలించారు. శామ్యూల్ భార్య ప్రియాంక ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా శామ్యూల్‌కు భార్య, కుమార్తె సమీర, కుమారుడు వరుణ్, ప్రభాకర్‌కు భార్య చిన్నారి, పిల్లలు త్రినాథ్, తేజస్విని, చందు ఉన్నారు.





ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందిన ప్రభాకర్, శామ్యూల్

కుటుంబాల్లో విషాదం

శంఖవరం, ఏప్రిల్ 1: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివారులో జరిగిన ప్రమాదం కత్తిపూడిలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన ఇద్దరు మృత్యువాత పడగా మరో ముగ్గురు గాయపడ్డారు. చనిపోయిన వారు ఇద్దరూ రోజు వారీ కూలి వస్తేనే జీవనం గడిపే పరిస్థితి. వెల్డింగ్ చేసే కొంజర్ల ప్రభాకర్‌కు (38) భార్య చిన్నారి, కుమారులు త్రినాథ్, చందు, కుమార్తె తేజస్విని ఉన్నారు. లారీ డ్రైవర్‌గా పనిచేసే బూరా సోమరాజు (39)కు భార్య ప్రియాంక, కుమార్తె సమీర, కుమారుడు వరుణ్ ఉన్నారు. ఈ ఇద్దరి సంపాదనతోనే ఆయా కుటుంబాలు నడుస్తున్నాయి. అప్పటివరకూ అందరితో కలిసి మెలిసి ఉండే వారిపై ఒకేసారి ఉప్పెనలా మృత్యువు దూసుకొచ్చిందని కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. వెల్డింగ్ షాపు యజమాని నున్న లోవరాజు తీవ్రంగా గాయపడ్డాడు. మరో ముగ్గురికి కళ్లల్లో ఆయిల్ పడడంతో స్థానిక ఆస్పత్రిలో చికిత్సనందించి మెరుగైన చికిత్స కోసం కాకినాడ తరలించారు.



ప్రభాకర్



శామ్యూల్

ఘనంగా ఆలయ పునర్నిర్మాణ వేడుకలు

- రత్నగిరిపై ప్రత్యేక పూజలు, నివేదన
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



పండితులను సత్కరించిన అధికారులు

అన్నవరం, ఏప్రిల్ 4: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి ఆలయ పునర్నిర్మాణ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున 4 గంటలకు మూలవరులను సుప్రభాత సేవతో మేల్కొలిపి అభ్యంగన స్నానమాచరింపచేశారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. విశేష పదార్థాలను నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నాటి ఆలయ పునర్నిర్మాణంలో భాగస్వాములైన పండితులను దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామచంద్ర మోహన్ సత్కరించారు. ఈ సందర్భంగా నాటి అనుభవాలను పండితులు వివరించారు. దేవదాయ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణంలో అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్ పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఆలయాన్ని పునర్నిర్మించాలని 12 ఏళ్ల క్రితం నివేదిక ఇచ్చినా ఏ అధికారి సాహసించలేకపోయారని పండితులను శృంగేరీ పీఠానికి తీసుకెళ్లి వారి సూచనలతో ఏడాది వ్యవధిలోనే పూర్తిచేయడం అభినందనీయమని అన్నారు. పుష్కరకాలం తర్వాత మరలా అన్నవరం దేవస్థానానికి రావడం ఇప్పుడు బంగారు ధ్వజస్తంభం ఏర్పాటు, జాతీయరహదారిపై నమూనాలయం నిర్మాణం పూర్తి ఆయన చేతుల మీదుగా జరగడం పూర్వ జన్మ సుకృతమని అన్నారు. ఈ సందర్భంగా దేవదాయ కమిషనర్ ఈవోను సత్కరించారు. సత్కార గ్రహీత రామచంద్రమోహన్ మాట్లాడుతూ తన బాధ్యతను మాత్రమే నిర్వహించానని సిబ్బంది అందరి సహకారంతో ఆలయ పునర్నిర్మాణం పూర్తి చేయగలిగానని అన్నారు. అనంతరం ఆయన సత్యదేవుడిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిథిలావస్థకు చేరిన వెండి ధ్వజ స్తంభాన్ని పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, పీఆర్వో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో వెళుతున్న ఆటో బోల్తా

పలువురికి గాయాలు



గాయపడిన విద్యార్థులు

సామర్లకోట, ఏప్రిల్ 1: సామర్లకోట పట్టణ శివారు బ్రౌన్‌పేట వద్ద గల వైఆర్ఎల్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు వెళుతున్న ఆటో విస్తరణ శిక్షణా కేంద్రం సమీపంలో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు విద్యార్థినులు తీవ్రంగా గాయపడ్డారు. పెద్దాపురం మండలం ఆర్‌బీ. కొత్తూరు, రాయభూపాలపట్నం, పెద్దాపురం ప్రాంతాలకు చెందిన ఏడుగురు విద్యార్థినులు ఒకే ఆటోలో కళాశాల నుంచి ఇంటికి తిరుగు ప్రయాణం కాగా సోమవారం సాయంత్రం ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించే ప్రయత్నంలో ఆటో డ్రైవర్ ఆకస్మికంగా బ్రేకులు వేయడంతో ఒక్కసారిగా రెండు పల్టీలు కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థులు రోడ్డుపై చిందరవందరగా పడిపోయారు. పలువురికి గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. వారిలో ఒక విద్యార్థినికి తలపై గాయం కావడంతో ఏడీబీ రోడ్డులో ఉన్న మెడికవర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోట ఎస్ఐ మౌనిక క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. కేసు సామర్లకోట పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగురాలిపై అత్యాచార యత్నం

ఆత్రేయపురం, ఏప్రిల్ 1: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలో ఓ దివ్యాంగురాలిపై సోమవారం ఓ యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తల్లిదండ్రులు కూలిపనికి వెళ్లగా దివ్యాంగురాలు ఇంట్లో ఒంటరిగా ఉంది. దీనిని గమనించిన అదే ప్రాంతానికి చెందిన అంజి అనే యువకుడు ఇంట్లోకి ప్రవేశించి దివ్యాంగురాలిపై అత్యాచారయత్నానికి ఒడిగట్టాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో ఆ యువకుడు పరారయ్యాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు ఆమె బోరున విలపించి విషయాన్ని చెప్పింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాస్ చెప్పారు.

మావోయిస్టుల కరపత్రాలు కలకలం





ఎటపాక, ఏప్రిల్ 1: భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్ట్) పేరుతో సోమవారం కూనవరం- భద్రాచలం రోడ్‌లోని గౌరిదేవిపేట- గన్నవరం గ్రామాల మధ్యలో రహదారిపై మావోయిస్టు కరపత్రాలు వెలిశాయి ఈ కరపత్రాలు చర్ల- శబరి ఏరియా కమిటీ మావోయిస్టుల పేరుతో ప్రత్యక్షమయ్యాయి. రహదారిపై పక్కన ఉన్న వృక్షాలపై కరపత్రాలను అంటించారు. ఇందులో దగాకోరు పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించాలని, కార్పొరేట్ కంపెనీల మైనింగ్స్, ప్లాంట్లు, రోడ్లు, డ్యామ్‌లు ప్రాజెక్టులను నిలిపి వేయాలని పేర్కొన్నారు. ఆదివాసీల స్వయం ప్రతిపత్తికి, చట్టాలకు భంగం కలిగించే పోలీస్ క్యాంపులు, ఉద్యమాలను అణిచివేసే పారా మిలటరీ, స్పెషల్ బలగాలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మూడు రోజుల వ్యవధిలో ఎటపాక మండలంలో రెండో సారి మావోల కరపత్రాలు కనిపించడం పోలీసులకు సవాలుగా మారుతోంది. గత శనివారం కనాయిగూడెం- తూర్పుబాక మధ్యలో, అలాగే చెన్నంపేట- సీతంపేట గ్రామాల మధ్యలో కరపత్రాలు కనిపించిన సంగతి తెలిసిందే.. కాగా మావోల కరపత్రాల సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే వాటిని స్వాధీనం చేసుకున్నారు

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులు..

కాకినాడకు పళ్లంరాజు, రాజమహేంద్రవరానికి రుద్రరాజు



కాకినాడసిటీ, ఏప్రిల్ 1: కాంగ్రెస్ పార్టీ కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజును కాంగ్రెస్ సీఈసీ ఖరారు చేసింది. కాకినాడ ఎంపీగా ఆయన ఏడోసారి బరిలో నిలువనున్నారు. తొలిసారి 1989లో పోటీ చేసి గెలుపొందారు. తర్వాత 1991లో మధ్యంతర ఎన్నికల్లో, 1998 మధ్యంతర ఎన్నికల్లో ఓటమి చెందారు.1999లో కాకినాడ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం చెందారు. 2004, 2009 ఎన్నికల్లో కాకినాడ పార్లమెంట్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2006 నుంచి 2014 మధ్యకాలంలో కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రిగా, కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా కొనసాగారు. 2014లో పోటీ చేసి ఓడిపోయారు. 2019 ఎన్నికలకు పళ్లంరాజు దూరంగా ఉండి ఆయన బాబాయ్ మల్లిపూడి రాంబాబును పోటీలో ఉంచారు.

రాజమహేంద్రవరం నుంచి గిడుగు రుద్రరాజు



రాజమహేంద్రవరం, ఏప్రిల్.1(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజును కాంగ్రెస్ అధిష్ఠానం ఖరారు చేసింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ప్రాంతానికి చెందిన రుద్రరాజు కాంగ్రెస్‌లో సీనియర్ నేత. కార్యకర్త స్థాయి నుంచి పీసీసీ అధ్యక్షుడిగా ఎదిగారు. వైఎస్ షర్మిలారెడ్డి పీసీసీ ప్రెసిడెంట్ అయ్యే వరకూ ఆయనే కొనసాగారు. ఈ ప్రాంతంలో చాలా మందికి ఆయన సుపరిచితుడు. ఇంతవరకూ టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి, వైసీపీ మధ్యనే లోక్‌సభలో పోటీ ఉంటుందని అందరూ భావించారు. రుద్రరాజు ప్రకటనతో ఇప్పుడు త్రిముఖ పోరు ఖరారైంది.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి





కొవ్వూరు, ఏప్రిల్ 1: ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాగల్లుకు చెందిన షేక్ అబ్దుల్ కుతూష్(22) నల్లజర్లలో కళ్లజోళ్ల షాపులో పనిచేస్తున్నాడు. సోమవారం పని ముగించుకుని యాక్టివా బైక్‌పై రాజమహేంద్రవరం బయలుదేరాడు. జాతీయ రహదారిపై మార్గమధ్యంలో కొవ్వూరు ఏషియన్ పెయింట్స్ గొడౌన్ వద్దకు చేరుకునే సరికి ఎదురుగా ఉన్న డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కుతూష్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్ఐ జుబేర్ మహమ్మద్ తెలిపారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో రూ.లక్ష స్వాధీనం

అల్లవరం, ఏప్రిల్ 1: ఎన్నికల నేపథ్యంలో అల్లవరంలో ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలో రూ.1,00,400 స్వాధీనం చేసుకున్నారు. సోమేశ్వరం గ్రామానికి చెందిన రఘు మోటారు సైకిల్ బ్యాగులో నగదు తీసుకుని వెళ్తుండగా పట్టుకున్నారు. సరైన ఆధారాలు చూపకపోవడంతో ఆర్డీవో వద్దకు పంపించామని ఎంపీడీవో చెప్పారు. తనిఖీలో ఎంఈవో-2 ఎస్.ఏడుకొండలు, ఈవోపీఆర్డీ ఎస్వీవీ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు శేఖర్‌బాబు, లక్ష్మి పాల్గొన్నారు.

ఇప్పటివరకు రూ.28.89 లక్షలు సీజ్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటి వరకూ రూ.28,89,810 సీజ్ చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె.మాధవీలత తెలిపారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం ఎన్నికల నిర్బంధ వ్యవస్థ (ఈఎస్ఎంఎస్) పనితీరుపై సీజర్ నోడల్ ఏజెన్సీ అధికారులతో సమీక్షించారు. ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో సీజ్ చేసిన నగదు, మద్యం, మాదక ద్రవ్యాలు, విలువైన మెటల్, ఉచితాలు, ఇతర వస్తువుల డేటాను ఎప్పటికప్పుడు డిజిటలైజేషన్ చేయాలన్నారు. అధిక మొత్తాలపై నిఘా పెట్టాలన్నారు. రైల్వే, రోడ్డు రవాణా ద్వారా ఎక్కువ తరలింపులు ఉంటాయని తెలిపారు. తూర్పుగోదావరి ప్రధాన రహదారిలో ఉండడం వల్ల ఇతర ప్రాంతాలకు ఈ రోడ్డు మార్గాన ఎన్నికల్లో పంపిణీకి వస్తువుల రవాణా జరుగుతుంటుందని చెప్పారు. జిల్లాకు వచ్చే కంటైనర్ల రికార్డులు పరిశీలించి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. రూ.50 వేలు కంటే ఎక్కువ నగదు దగ్గర ఉంటే ఆధారాలు చూపాలన్నారు. రాజమహేంద్రవరం అర్బన్‌లో ఇప్పటివరకూ రూ.2 లక్షలు, అనపర్తిలో రూ.1,27,860, నిడదవోలులో రూ.1.50,000, గోపాలపురంలో రూ.1,20,000, రాజమహేంద్రవరం అర్బన్‌లో రూ.90 వేలు సీజ్ చేశామన్నారు. జిల్లా సీజర్ నోడల్ అధికారి, జిల్లా ఆడిట్ అధికారి కేవీ వెంకటేశ్వరావు, సెబ్ అధికారులు పి.సోమశేఖర్, కె.జయ మౌనిక, ఎల్‌డీఎం డీవీ ప్రసాద్, ఐటీ అధికారులు శీలం వీర బాబు, బీవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర జీఎస్టీ, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్ల తొలగింపు

ముమ్మిడివరం, ఏప్రిల్ 1: వైసీపీ నాయకులతో తిరుగుతూ వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్న ముమ్మిడివరం నగర పంచాయతీ సూరాయిచెరువు గ్రామ సచివాలయ పరిధిలోని వలంటీరును విధుల నుంచి తొలగిస్తున్నట్టు కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నగరం పంచాయతీ పరిధిలోని సూరాయిచెరువు గ్రామ సచివాలయం బాలయోగి కాల్వగట్టు క్లస్టర్-1 వలంటీరు విత్తనాల నాగార్జున గత నెల 30న ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పితాని బాలకృష్ణ కర్నూలు జిల్లా గుత్తికొండలో సీఎం జగన్ సమక్షంలో వైసీపీ పార్టీలో చేరుతున్న సందర్భంగా వైసీపీ నాయకులతో కలిసి పాల్గొన్నాడు. ఈ మేరకు పత్రికల్లో కథనాలు వెలువడడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వలంటీరు నాగార్జునను విధుల నుంచి తొలగిస్తూ కమిషనర్ ఉత్తర్వులిచ్చారు. ఆ వలంటీరు నుంచి మొబైల్, ఫోన్ సిమ్, బయోమెట్రిక్ డివైజ్‌లను స్వాధీనం చేసుకుని ఆ క్లస్టర్ పరిధిలో మరో వలంటీరు నియామకానికి చర్యలు చేపట్టాలని సచివాలయ కార్యదర్శికి కమిషనర్ ఆదేశాలిచ్చారు.

సఖినేటిపల్లి లంకలో..

అంతర్వేది, ఏప్రిల్ 1: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లిలంక గ్రామానికి చెందిన సచివాలయం-1 ఎనిమిదో క్లస్టర్ వలంటీరు సేనాపతి పద్మాకర్ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో బీవీ సత్యనారాయణ తెలిపారు. ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా పోస్టు చేసిన కారణంగా అతన్ని విధుల నుంచి తొలగించామని వలంటీర్లు ఎవరు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించరాదని, అలాగే వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లను ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఏపీపీఎస్సీలో అవకతవకలపై ఫిర్యాదు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీలో జరిగిన అవకతవకలపై రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. సీఎం జగన్, ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్, రామకృష్ణారెడ్డి నేతృత్వంలో కుంభకోణానికి తెరతీశారని ఫిర్యాదులో ఆరోపించారు. ఎంతోమంది నిరుద్యోగులను అన్యాయం చేసి పోస్టులను అమ్ముకున్నారని విమర్శించారు. కొన్ని పోస్టులను వారి అనుయాయులకు కట్టబెట్టుకున్నారన్నారు. ఫిర్యాదు అందజేసిన వారిలో టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు సాయిదీపక్ తదితరులు ఉన్నారు.

3500 క్యూసెక్కుల విడుదల

మోతుగూడెం, ఏప్రిల్ 1: డొంకరాయి జలాశయం నుంచి 3500 క్యూసెక్కుల నీటిని శనివారం సాయంత్రం నుంచి విడుదల చేస్తున్నారు. గోదావరి డెల్టా రబీ పంటలకు మార్చి 10 నుంచి సీలేరు కాంప్లెక్సులోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రం నుంచి 3500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అయితే రబీ పంటలకు ఈ నీరు సరిపోకపోవడంతో ఇరిగేషన్ అధికారులు డొంకరాయి నుంచి అదనంగా మరో 3500 క్యూసెక్కుల నీటిని 5 రోజుల పాటు విడుదల చేయాలని జెన్‌కో ఉన్నతాధికారులను కోరారు. దీంతో డొంకరాయి జలాశయం నుంచి 3500 క్యూసెక్కుల నీటిని రబీకి విడుదల చేయాలని ఆదేశించడంతో శనివారం సాయంత్రం డొంకరాయి జలాశయం నుంచి 6,7 నెంబర్ గేట్ల ద్వారా 3500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సీలేరు కాంప్లెక్సు నుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా 3500 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి లేకుండా జలాశయం నుంచి మరో 3500 క్యూసెక్కులతో కలిసి మొత్తం 7 వేల క్యూసెక్కుల నీరు రబీ పంటలకు సీలేరు నుంచి విడుదల అవుతుందని సీలేరు కాంప్లెక్సు సీఈ బి.శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీలేరు కాంప్లెక్సు సూపరింటెండెంట్ ఇంజనీర్లు కేకేవీ ప్రశాంత్‌కుమార్, వెంకటేశ్వరరావు, ఈఈ బాలకృష్ణ, ఏడీఈ అప్పలనాయుడు, డీఈటీ వరప్రసాద్ పాల్గొన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

రామరాజ్య స్థాపనలో ప్రజలు భాగస్తులవ్వాలి

» టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల


సమావేశంలో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

తొండంగి, ఏప్రిల్ 1: రానున్న ఎన్నికల్లో రామరాజ్యం కావాలో.. రాక్షస రాజ్యం కావాలో తేల్చుకోవాల్సిన తరుణం వచ్చిందని, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి రామరాజ్య స్థాపనలో భాగస్తులు కావాలని టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు పిలుపునిచ్చారు. సోమవారం పంపాదిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందన్నారు. పిల్లల భవిష్యత్తు నాశనం కాకుండా ఉండాలంటే, ప్రజలకోసం పనిచేసే టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. పంపాదిపేటలో వైసీపీనుంచి కార్యకర్తలు భారీగా టీడీపీలో చేరారు. వీరికి యనమల రామకృష్ణుడు పార్టీ కండవాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ నేతలు మోతుకూరి వెంకటేష్, సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి, యనమల రాజేష్, కోడ వెంకట రమణ పాల్గొన్నారు.

పనిచేయాలని యనమల సూచించారు.

'సత్యప్రభ గెలుపునకు కృషి చేయండి'

ఏలేశ్వరం, ఏప్రిల్ 1: తునిలో శాసనమండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడిని టీడీపీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కార్యాలయంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభ, టీడీపీలో చేరిన కౌన్సిలర్ అలమండ చలమయ్య, మాజీ కౌన్సిలర్ కడింశెట్టి వాసుతోపాటు టీడీపీ నాయకులు కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి కలిసి ఆయన్ను శాలువాతో సత్కరించారు. వరుపుల సత్యప్రభ గెలుపునకు సమన్వయంతో

చంద్రబాబుతోనే దళితుల సంక్షేమం: సుభాష్

కాజులూరు, ఏప్రిల్ 1: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలోనే దళితుల సంక్షేమం సాధ్యమని రామచంద్రపురం టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కాజులూరు, గొల్లపాలెం, మతుకుమిల్లిల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ కార్యకర్తలు సుభాష్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ క్రమంలో గొల్లపాలెం, కాజులూరు గ్రామాల్లో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కాజులూరులో మండల దళిత నాయకులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పేపకాయల బాబ్జీ, వనుం వీరబ్రహ్మం, మాజీ ఎంపీపీ యాళ్ల కృష్ణారావు, చుండ్రు వీర్రాజుచౌదరి, కురుపూడి కొండ, గుబ్బల ఏసురాజు, పోతురాజు భీమారావు, జల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

టీడీపీ ఇంటింటా ప్రచారం

కిర్లంపూడి, ఏప్రిల్ 1: కిర్లంపూడిలో టీడీపీ జిల్లా నాయకులు తూముకుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి కుర్ల చినబాబు ఆధ్వర్యంలో టీడీపీ ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారానికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత, సర్వారాయుడు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డిబాబు, ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, టీడీపీ మండల అధ్యక్షుడు చదరం చంటిబాబు పాల్గొన్నారు.

కూటమిదే ఘన విజయం: వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు, ఏప్రిల్ 1: ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులదే ఘన విజయమని ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా తెలిపారు. మండలంలోని శరభవరంలో సోమవారం టీడీపీ, బీజేపీ, జనసేన నేతలతో కలిసికట్టుగా ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీనిలో భాగంగా టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, బీజేపీ నాయకుడు ఉమ్మడి వెంకట్రావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో లబ్ధి కోసమే పింఛన్లపై విష ప్రచారం

యండమూరు(కరప), ఏప్రిల్ 1: ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే పింఛన్ల పంపిణీపై వైసీపీ విషప్రచారం చేస్తుందని టీడీపీ కాకినాడ రూరల్ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు ఆక్షేపించారు. కరప మండలం యండమూరులో సోమవారం కాకినాడ రూరల్ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు వివరించి గాజుగ్లాసు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ ఖజానాలో నిధులు లేకనే పింఛన్ల పంపిణీ ఆగిందని, ఈ విషయాన్ని పక్కన పెట్టి రాజకీయం చేయాలనుకోవడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్, టీడీపీ, జనసేన నాయకులు బందారు మురళి, దేవు వెంకన్న, చుండ్రు వెంకన్నరాయచౌదరి పాల్గొన్నారు.

కూటమితో వైసీపీకి వణుకు: చినరాజప్ప

పెద్దాపురం, ఏప్రిల్ 1: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో వైసీపీలో వణుకు మొదలైందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని ఉలిమేశ్వరంలో నిర్వహించిన ప్రచారంలో జనసేన పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి(బాబు)తో కలిసి ఆయన సోమవారం ప్రచారం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తుకోసం ఎప్పుడూ శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. పార్టీల్లో చేరేవారికి ఎప్పుడూ ద్వారాలు తెరిచే ఉంటాయన్నారు. వైసీపీ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి అండగా నిలవాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నిమ్మకాయల రంగనాగ్, ఎలిశెట్టి నాని, పేకేటి వెంకటేశ్వరరావు (దొరబాబు), చాగంటి గోపాలకృష్ణ, నంది ఉమామహేశ్వరి పాల్గొన్నారు.


కరప మండలం యండమూరులో ప్రచారం చేస్తున్న నానాజీ, సత్తిబాబు


కాజులూరులో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి సుభాష్


పెద్దాపురం మండలం ఉలిమేశ్వరంలో చినరాజప్ప

వైసీపీనుంచి భారీగా టీడీపీలోకి చేరికలు


శంఖవరంలో పార్టీలోకి చేరిన వారితో సత్యప్రభ, నాయకులు

శంఖవరం, ఏప్రిల్ 1: మండల కేంద్రంలో వైసీపీకి భారీషాక్ తగిలింది. ఆ పార్టీని వీడి 100 కుటుంబాలు సోమవారం పర్వత సురేష్ ఆధ్వర్యంలో టీడీపీ అభ్యర్థి వరుపుల సత్యప్రభ సమక్షంలో టీడీపీలోకి చేరారు. సఖిరెడ్డి ప్రభాకర్, ముత్తు శ్రీను, బీరా దొరబాబు, బీరా అశోక్, మేడిది నల్లబాబు, పర్వత శ్రీరామ్, గెద్దాడ సంతోష్, దున్నే, నూకబాబు, లంకాడ రమేష్, చెక్కపల్లి శ్రీనివాస్ తదితర కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. టీడీపీ మండల అధ్యక్షుడు బద్ది రామారావు, టీఎన్‌టీయుసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా ఈశ్వరుడు, తెలుగు యువత అధ్యక్షుడు కీర్తి వెంకటసుబాష్, ఈగల దేవుళ్లు, పాకల ప్రసాద్, జనసేన నాయకులు మేకల కృష్ణ, ములికి వెంకన్న పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్

జగ్గంపేట, ఏప్రిల్ 1: జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు (బాబు) ఇటీవల వైసీపీకి రాజీనామా చేశారు. ఆయన సోమవారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సమక్షంలో గుంటూరు జిల్లా బాపట్లలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనకు చంద్రబాబు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ పార్టీ కండువాలతో సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ వైసీపీ ఒంటెద్దు పోకడలు నచ్చక కొంతకాలం క్రితమే ఆ పార్టీకి రాజీనామా చేశానన్నారు. ఆయన వెంట భూపాలపట్నం గ్రామానికి చెందిన నాయకులు వీవీబీ ప్రసాదరావు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

కిర్లంపూడి, ఏప్రిల్ 1: కిర్లంపూడికి చెందిన మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచ్ దివంగత ఎల్లపు లక్ష్మణరావు కుమారుడు దొరబాబు జనసేన నాయకుడు తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరారు.

రానున్నది కూటమి ప్రభుత్వమే: యనమల

తుని రూరల్, ఏప్రిల్ 1: రానున్నది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వమే అని యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఆ పార్టీ నాయకులు పెద్దఎత్తున టీడీపీలోకి చేరడం శుభ పరిణామన్నారు. అనంతరం కుమ్మరిలోవ గ్రామానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి జక్కాన రామునాయుడు, జక్కాన లోవరాజు ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. వీరికి యనమల రామకృష్ణుడు, తుని అభ్యర్థి యనమల దివ్య పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

వైసీపీని వీడి పెద్దఎత్తున టీడీపీలోకి ట్రాక్టర్ డ్రైవర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పెద్దఎత్తున చేరారు. వీరికి తేటగుంటలో యనమల రామకృష్ణుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ గెలుపుకు సమిష్టిగా పని చేయాలని ఆయన కోరారు. టీడీపీలోకి చేరిన వారిలో బోడపాటి రామకృష్ణ, గంటిపల్లి నారాయణరావు, కొల్లాబత్తుల అచ్యుతంతోపాటు పలు కుటుంబాలు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు.

టీడీపీ జనసేన సంయుక్త ప్రచారం

మాజీ ఎమ్మెల్యే వర్మను కలిసిన ఎంపీ అభ్యర్థి ఉదయశ్రీనివాస్


పిఠాపురంలో టీడీపీ కార్యాలయంలో వర్మను కలిసిన జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్

పిఠాపురం, ఏప్రిల్ 1: తెలుగుదేశం, జనసేన పార్టీలు సమన్వయంతో ముందుకు వెళ్తూ ప్రచారం నిర్వహించాలని టీడీపీ, జనసేన నేతలు నిర్ణయించారు. పిఠాపురం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మను కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పవన్‌కల్యాణ్ ఆదేశాలకు అనుగుణంగా ఉమ్మడి ప్రచారకమిటీలు నియమాకం, ప్రజల్లోకి వెళ్లడం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఎంపీ, ఎమ్మెల్యే జనసేన అభ్యర్థుల విజయానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. జగ్గయ్యచెరువు కాలనీకి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో వర్మ సమావేశమయ్యారు. జనసేన పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఉదయం పట్టణాల్లో వార్డులు, సాయంత్రం గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి టీడీపీ కార్యకర్త తమ సొంత ఎన్నికలా కష్టపడాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు వాసంశెట్టి సూరిబాబు, కాద రాజు, ఆగంటి లోవబాబు, కొండేపూడి సూర్యప్రకాష్, అనిశెట్టి సత్యానందరెడ్డి, సకుమళ్ల గంగాధర్, పిల్లి చిన్నా, కోడిగుడ్ల పెదబాబు, కొరుప్రోలు శ్రీను, మనకపల్లి రాజా పాల్గొన్నారు.

నీళ్ల ట్యాంకర్లలో భారీగా అవినీతి

» వాడివేడిగా గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశం

గొల్లప్రోలు, ఏప్రిల్ 1: నీళ్ల ట్యాంకర్ల వ్యవహారంలో భారీ అవినీతి చోటు చేసుకుందని, ప్రజలకు తాగునీరు ఇవ్వకుండా రోజుకి 30ట్యాంకర్ల నీటిని అమ్ముకుంటున్నారని కౌన్సిలర్లు ఆరోపించారు. ఈ వ్యవహారంలో అధికారులపై తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గొల్లప్రోలు నగర పంచాయతీ అత్యవసర సమావేశం సోమవారం చైర్‌పర్సన్ గంధ్రేటి మంగతాయారు అధ్యక్షతన జరిగింది. రెండురోజులక్రితం నిర్వహించిన సమావేశానికి అధికారులు హాజరుకాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. ఈ రోజు జరిగిన సమావేశంలో అజెండా చదవకుండానే 12వ వార్డు టీడీపీ కౌన్సిలరు గుళ్ల సుబ్బారావు ట్యాంకర్ల అంశాన్ని ప్రస్తావించారు. రోజుకు 30ట్రిప్పులకు పైగా జగనన్న కాలనీ, ఇతర ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని తరలిస్తూ ట్యాంకర్ 2వేల వంతున అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఆధారాలు ఉంటే చర్యలు తీసుకుంటామని ఏఈ ప్రభాకర్ తెలపగా వైసీపీ కౌన్సిలర్లును ఆదారాలు చూపించాలని సుబ్బారావు అడిగారు. ఎవ్వరు స్పందించకపోవడంతో అమ్ముడుపోయారా అంటూ ప్రశ్నించారు. ఈ దశలో పదో వార్డు కౌన్సిలరు మొగిలి దొరబాబు బి.ప్రత్తిపాడు రైస్‌మిల్లులో ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న దృశ్యాలకు సంబంధించి సెల్‌లో ఉన్న ఫోటోలను చూపించారు. టీడీపీ కౌన్సిలరు సుబ్బారావు భవన నిర్మాణాల పనులకు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న ఫొటోలను సమావేశంలో ప్రదర్శించారు. వైసీపీ కౌన్సిలరు గంటా అప్పలస్వామి కుళాయిల ద్వారా వస్తున్న కలుషిత నీటిని సీసాలో పట్టి చూపించారు. కలుషిత నీటిని ల్యాబ్‌కు పంపి పరీక్ష చేయించాలని, ఏఈ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం సరికాదని వైస్‌చైర్మన్ తెడ్లపు అలేఖ్యరాణి అన్నారు. ప్రతి దానికి కౌన్సిలర్లను ప్రూఫ్ కావాలని అడుగుతారా అంటూ మండిపడ్డారు. దీనితో కొంత సమయం సమావేశం నిలిచిపోయింది. అన్ని ట్యాంకులను పరిశీలించాలని, నీటిని ల్యాబ్‌లకు పరీక్షల నిమిత్తం పంపాలని కమిషనర్ రవికుమార్ ఏఈని ఆదేశించారు. వీధిలైట్ల అంశంపై ఏఈ, అలేఖ్యరాణిల మధ్య వాగ్వివాదం జరిగింది.

గవద బిళ్లలు వైరస్ జనిత వ్యాధి: డీఎంహెచ్‌వో

జీజీహెచ్(కాకినాడ), ఏప్రిల్ 1: గవద బిళ్లలు(మమ్స్) వైరస్ జనిత వ్యాధి అని 1-15 ఏళ్ల లోపు వయస్సు పిల్లల్లో ఈ వ్యాధి తుంపరలు, దగ్గు ద్వారా ఒకరి నుంచి మరొకరికి త్వరితగతిన వ్యాప్తి చెందుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ వెల్లడించారు. పారమిక్సో గ్రూప్ వైరస్ కారణంగా గొంతువద్ద ఉండే పెరోటిడ్ గ్రంథులు వాచి ఈ వ్యాధి సంక్రమిస్తుందని తద్వారా గొంతువద్ద నొప్పి తీవ్రతరం అవుతుందన్నారు. గవద బిళ్లలు రాకుండా ఎంఎంఆర్ వ్యాక్సిన్ 9 నుంచి 12 నెలల చిన్నారులకు ఒకటవ మోతాదు, 16 నుంచి 24 నెలల చిన్నారులకు రెండో డోసు, 4 నుంచి 6ఏళ్ల పిల్లలకు మూడోడోసు వ్యాక్సిన్ ఇప్పించడం ద్వారా ఈ వైరస్‌ను నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ కె.రత్నకుమార్, ఇన్‌చార్జ్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వి.అరుణ పాల్గొన్నారు.

వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్‌వో

జీజీహెచ్(కాకినాడ), ఏప్రిల్ 1: వడగాల్పులు వీస్తున్న తరణంలో చిన్నపిల్లలు, వృద్ధులు వడదెబ్బ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ సూచనలు చేశారు. వడదెబ్బ బారిన పడినవారి శరీర ఉష్ణోగ్రత 105.1 ఎఫ్ కంటే ఎక్కువ కలిగి ఉంటుందన్నారు. మత్తుపానీయాలు ఎక్కువగా సేవించరాదని, మద్యపానం ద్వారా శరీర ఉష్ణోగ్రత అమాంతం పెరిగిపోతుందన్నారు. జిల్లావ్యాప్తంగా ఆరోగ్య సిబ్బంది గ్రూప్‌మీటింగ్స్ ద్వారా ఓఆర్ఎస్ డిమాన్‌స్ట్రేషన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

వేసవిలో వడదెబ్బ తగలకుండా అవగాహన: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 1: వేసవిలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి రాష్ట్ర సచివాలయంనుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతీయ ఉపాధి హామీ పథకం, కూలీల వేతనం, పనిదినాలు, తాగునీటి సరఫరా, వడగాల్పులు, విద్యుత్ సరఫరా, పింఛన్ల పంపిణీ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ ప్రజలు అత్యవసరమైతే తప్ప ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు దినసరి వేతనం రూ.272 నుంచి రూ.300కు పెంచిందన్నారు. ఉపాధి హామీ కూలీలు వడదెబ్బ తగలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కూలీలు పనిచేసే ప్రాంతంలో తాగునీరు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో తిప్పేనాయక్, డ్వామా పీడీ వెంకటలక్ష్మీ, డీపీవో భారతి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

పట్టాల పంపిణీపై చర్చకు రావాలి

జగ్గంపేట రూరల్, ఏప్రిల్ 1: ఇర్రిపాకలో ఆదివారం తోట నరసింహం చేసిన వ్యాఖ్యలను జ్యోతుల నెహ్రూ ఖండించారు. జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవాస్తవాలను ప్రచారం చేయడంలో వైసీపీనాయకులు వారికి వారే సాటి అని ఎద్దేవా చేశారు. గ్రామంలో 200మందికి పట్టాలు వచ్చినట్లు ఎవరో ఆపినట్లు కబుర్లు చెబుతున్నారన్నారు. ఇప్పుడైనా పట్టాలు పంపిణీ చేస్తే తమకు అభ్యంతరం లేదని నిర్భయంగా పంపిణీ చేయచ్చన్నారు. మండలంలో ఇళ్ల పట్టాల మాటున వైసీపీ నాయకులు జేబులు నింపుకున్నారన్నారు. చిత్తశుద్ధి ఉంటే పట్టాల పంపిణీపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

ప్రత్తిపాడులో గ్రామోత్సవం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 1: మండలంలోని ప్రత్తిపాడులో కల్యాణ వెంకటేశ్వరస్వామి విగ్రహప్రతిష్ట మహోత్సవంలో భాగంగా సోమవారం స్వామివార్లను ఊరేగించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈనెల 3న విగ్రహ ప్రతిష్ఠ, 6న అన్నదానం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ధర్మవరంలోని రుక్మిణి సత్యభామ సమేత రాజగోపాలస్వామి కల్యాణోత్సవాలు ముగింపులో భాగంగా సోమవారం అన్నదానం నిర్వహించారు.

పింఛన్ సొమ్మును కాంట్రాక్టర్లకు దోచిపెట్టారు: మాజీ ఎమ్మెల్యే వర్మ

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 1: పింఛన్ల సొమ్మును కాంట్రాక్టర్లకు దోచిపెట్టి ఆ నెపాన్ని ప్రతిపక్షాలపైకి నెట్టాలని వైసీపీ ప్రయత్నిస్తోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో సోమవారం బీసీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ పెన్షన్ల పంపిణీలో వలంటీర్లు పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశించిందని, దానికి టీడీపీకి సంబంధం ఏంటని ప్రశ్నించారు. 1న పెన్షన్ ఇవ్వాల్సిన వైసీపీ ప్రభుత్వం తనకు కావాల్సిన వారి బిల్లులు చెల్లించేందుకు పింఛన్ నిధులను వాడుకుందని ఆరోపించారు. జనసేన కార్యకర్తలను కలుపుకుని ప్రచారం నిర్వహించాలని సూచించారు. టీడీపీ మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉలవకాయల దేవేంద్రుడు, మల్లిపూడి వీరబాబు, రావు రవి, ఒరుగంటి వీరబాబు, పల్లయ్య, దూళ్ల లచ్చబాబు, మణిబాబు పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాప్

గండేపల్లి, ఏప్రిల్ 1: ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగంలో పీసీబీ డిజైన్ వర్క్‌షాప్ శిక్షణ కార్యక్రమంలో ఆరురోజులపాటు విజయవంతంగా నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ ట్రైనింగ్‌లో విద్యార్థులకు ఎలక్ట్రానిక్ రంగంలో వినియోగించే పీసీబీ రోడ్డుల తయారీ వాటి డిజైనింగ్, వినియోగించే పద్ధతి వివరించి, వాటి నమూనాలు తయారు చేయించారు. రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి శిక్షణ సంస్థకు చెందిన సీహెచ్ సంతోష్ శిక్షణ అధిపతిగా పాల్గొన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ మేడపాటి శ్రీనివాసరెడ్డి, డీన్ డాక్టర్ జి.సురేష్, డీన్ వి.సత్యనారాయణ, ఈసీఈ విభాగం అధిపతి డాక్టర్ ఎన్.రాధా, కర్ర విష్ణువర్దన్‌రెడ్డి, కోఆర్డినేటర్లు అసోసియేట్ ప్రొఫెసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాప్ విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరిచి వారి ఉద్యోగాల సాధనకు మరింత దోహదపడతాయన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలి: ఎంపీడీవో

కరప, ఏప్రిల్ 1: మండలంలోని అన్ని సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో కొంకి అప్పారావు సూచించారు. కరపలో సోమవారం ఆయన కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశమై పింఛన్ల పంపిణీకి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పింఛన్ల పంపిణీవద్ద ప్రచారం చేయరాదని, కోడ్ ఉల్లంఘన జరిగితే సచివాలయ సిబ్బందిపై ఎన్నికల నియమావళిని అనుసరించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపటినుంచే పింఛన్ల పంపిణీ

సామర్లకోట, ఏప్రిల్ 1: మండలంలో పింఛన్లు ఈనెల 3 నుంచి సచివాలయాల సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో శ్యామ్‌సుందర్ వెల్లడించారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 11,950 పింఛన్‌దారులకు పింఛను డబ్బులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. సామర్లకోట పట్టణ పరిధిలో ఎవరితో పంపిణీ చేపట్టాలో మార్గదర్శకాలు అందాల్సిఉందని మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు తెలిపారు.

కిర్లంపూడి, ఏప్రిల్ 1: ఈనెల 3వతేదీ నుంచి గ్రామ సచివాలయాల్లో పెన్షన్‌ను సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తారని ఎంపీడీవో బడే రాజేశ్వరరావు అన్నారు. సోమవారం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వలంటీర్స్ నుంచి మొబైల్‌ఫోన్లు, స్కానర్స్, డివైస్ తదితర వాటిని స్వాధీనం చేసుకోవాలన్నారు. సమావేశంలో పంచాయతీ విస్తరణాధికారి కె.సత్యప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై తప్పుడు ప్రచారం మానుకోవాలి: నెహ్రూ

జగ్గంపేట రూరల్, ఏప్రిల్ 1: పింఛన్ల పంపిణీపై వాస్తవాలను దాచి వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని జగ్గంపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ ధ్వజమెత్తారు. పింఛన్లపై కూడా రాజకీయం చేయడం వైసీపీకే చెల్లిందన్నారు. మండల, గ్రామ సచివాలయాలు ఉన్నా పింఛన్ల పంపిణీకి ఆలోచన చేయకుండా దుష్ట రాజకీయం చేస్తోందని విమర్శించారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారం మొదలుపెట్టారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఇకనైనా పారదర్శకంగా పెన్షన్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

పింఛన్లు పంపిణీ వెంటనే చేపట్టాలి

ప్రత్తిపాడు, ఏప్రిల్ 1: పింఛన్ల పంపిణీ వెంటనే చేపట్టాలని పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను విజ్ఞప్తి చేశారు. ఎంపీడీవోను సోమవారం కలిసి దీనిపై ఒక వినతిపత్రం అందజేశారు.

శహపురంలో 'న్యాయం కోసం నల్లమిల్లి'

అనపర్తి, ఏప్రిల్ 1: టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా అనపర్తి అసెంబ్లీ సీటును కోల్పోయిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామ కృష్ణారెడ్డి చేపట్టిన న్యాయం కోసం నల్లమిల్లి కార్యక్రమం సోమవారం పెద పూడి మండలం శహపురంలో జరిగింది. తల్లి సత్యవతి, సతీమణి మహా లక్ష్మి, కుమారుడు మనోజ్‌రెడ్డి, కుమార్తె డాక్టర్ సనాతనితో కలిసి ఆయన గ్రామంలో పర్యటించారు. తన భవిష్యత్ ప్రణాళిక ప్రజల అభిప్రాయంతో ముడిపడి ఉందని, ఏమి చేయాలో వారే చెప్పాలంటూ ఇంటింటికీ వెళ్లి పరి స్థితిని వివరించారు. ఈ సందర్భంగా తన తల్లి సత్యవతిని రిక్షాలో కూర్చో బెట్టి తిప్పడంతో ప్రజల్లో విపరీతమైన సానుభూతి వ్యక్తమైంది. చంద్ర బాబు అనపర్తి సీటును రామకృష్ణారెడ్డికే కేటాయిస్తారని, అధైర్య పడొద్దని గ్రామస్థులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా నల్లమిల్లి మీడియాతో మాట్లాడుతూ అనపర్తిలో పార్టీని కాపాడుకోవడం ఎంత ముఖ్యమో తనను నమ్ముకున్న కార్యకర్తలను రక్షించుకోవడం కూడా అంతే ముఖ్యమన్నారు. ఇప్పటికైనా మూడు పార్టీల అధినేతలు పునరాలోచన చేసి సమర్థులైన వారికి టికెట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


వృద్ధాప్యంలో ఉన్న తల్లిని రిక్షాలో తిప్పుతూ న్యాయం అడుగుతున్న నల్లమిల్లి కుటుంబం

ఏపీపీఎస్సీలో కుంభకోణంపై ఫిర్యాదు

తాళ్లరేవు, ఏప్రిల్ 1: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డ సీఎం జగన్, ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతం సవాంగ్‌పై చర్యలు తీసుకోవాలని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో నిరుద్యోగులు సోమవారం కోరింగ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

కరప, ఏప్రిల్ 1: గొర్రిపూడిలోని హైస్కూల్ వెనుక ప్రభుత్వస్థలాన్ని కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకుంటున్నారంటూ పలువురు గ్రామస్తులు సోమవారం కరప తహశీల్దార్ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. గ్రామంలో డ్రైనేజీ నిర్మాణ పనులనుంచి వెలికి తీసిన మట్టితో ఈ ప్రభుత్వ స్థలాన్ని చదును చేసి విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారని జనసేన నాయకులు యర్రంనీడి బుచ్చిరాజేష్, పి.సత్యనారాయణ, వీరబాబు ఆరోపించారు. ఆర్‌బీకే, సచివాలయ భవనాల నిర్మాణం చేసినచోట డీ-పట్టా భూమిని సైతం లేఅవుట్‌లా మార్చి విక్రయించ చూస్తున్నారని ఫిర్యాదుచేశారు.

'దిశ' కార్యాలయం ప్రారంభం

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 1: న్యూగైగోలపాడు సోమాలమ్మగుడివద్ద సోమవారం దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ నూతన కార్యాలయాన్ని 49వవార్డు మాజీ కార్పొరేటర్ పాలిక ఉషారాణిప్రకాష్ ప్రారంభించారు. దిశ ఉమెన్ ప్రొటెక్షన్ అధ్యక్షురాలు రమ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు, యువతుల సంరక్షణకోసం ఈఫౌండేషన్ పనిచేస్తుందన్నారు.

మూలగపూడి సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

రౌతులపూడి, ఏప్రిల్ 1: మూలగపూడి సర్పంచ్ తమరాల సత్యనారాయణ చెక్ పవర్‌ను రద్దుచేశారు. ఈ మేరకు డీఎల్‌పీవోనుంచి పంచాయతీ కార్యదర్శికి ఉత్తర్వులు అందాయి. గొర్రిపాటి అశోక్, తాతరావు గ్రామంలో సిమెంట్ రహదారులు వేశారు. వీటిని 14వ ఆర్థిక సంఘం నిధులతో వేయగా సర్పంచ్ బిల్లులు మంజూరు చేయలేదని కాంట్రాక్టర్లు హైకోర్టుకు వెళ్లారు. కోర్టు ఆదేశాలకు మేరకు సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేశారు.

చలివేంద్రం ప్రారంభం

ఏలేశ్వరం, ఏప్రిల్ 2: పట్టణంలో తహశీల్దార్ కార్యాలయంవద్ద సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సిబ్బంది రంగారావు, అవసరాల కిశోర్, శ్యామల, సూర్యనారాయణ, చిన్నారి పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

గండేపల్లి, ఏప్రిల్ 1: తాళ్లూరు దాబాసెంటర్ వద్ద 70ఏళ్ల వయస్సుగల యాచకుడు చనిపోయాడు. వీఆర్వో సుబ్బారావు ఫిర్యాదు మేరకు గండేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

'ఆదిత్య'లో ప్రో కార్ట్ రేసింగ్

గండేపల్లి, ఏప్రిల్ 1: ఆదిత్య వర్సిటీ మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో నాలుగురోజులపాటు నిర్వహించే జాతీయస్థాయి ప్రో కార్టింగద్ ఎండురెన్స్ చాంపియన్‌షిప్ సీజన్-4 పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. కర్ణాటక, తెలంగాణ,తమిళనాడురాష్ట్రాలనుంచి 13టీంలు ఇందులో పాల్గొన్నారని ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. 13 బృందాలకు 350మంది పాల్గొంటారన్నారు. వెహికల్ మోడల్, వెయిట్ బ్రేక్, ఇంజన్, పికప్, లోడ్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు 4న నిర్వహించే ముగింపు సభలో బహుమతులు అందజేస్తారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి, డోలా సంజయ్, ఆదిరెడ్డి రమేష్ పాల్గొన్నారు.

ఏఐఅండ్ ఎంఎల్ అంశంపై వర్క్‌షాప్

గండేపల్లి, ఏప్రిల్ 1: సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగంలో రేవంత్ గ్లోబల్ టెక్నాలజీస్ సారథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ అనే అంశంపై విద్యార్థులు నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఐదురోజులపాటు కొనసాగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. కార్యక్రమాన్ని రేవంత్ గ్లోబల్ టెక్నాలజీస్ విశేష సేవలందిస్తున్న పి.రమాకాంత్ నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో డీన్ అకాడమిక్స్ డాక్టర్ పుల్లెల రవికుమార్, విభాగాధిపతి డాక్టర్ వైకేఎస్‌సుబ్బారావు, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ నల్లభాను తేజ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సామర్లకోట, ఏప్రిల్ 1: సామర్లకోట మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను అధికారులు సోమవారం పరిశీలించారు. తహశీల్దార్ వై.శ్రీనివాస్, వీఆర్వోలు వెంకటేశ్వరి, ఫాజిల్ అబ్బాస్‌లతో కలిసి పోలింగ్ కేంద్రాల్లో కనీస సదుపాయాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. మాధవపట్నం జెడ్పీఉన్నతపాఠశాల, పంచాయతీ కార్యాలయం, జమునానగర్‌లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 1: జిల్లా పరిధిలోని సిటీ, రూరల్, పిఠాపురం, పెద్దాపురం, ప్రత్తిపాడు, జగ్గంపేట, తుని నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ స్ట్రాంగ్ రూమ్‌లకు పటిష్ట భద్రత కల్పించాలని కాకినాడ సిటీ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు ఆదేశించారు. ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్, స్ట్రాంగ్‌రూమ్‌లను ఏర్పాటు చేసిన జేఎన్‌టీయూకే సివిల్‌బ్లాక్, లైబ్రరీ, మెకానికల్ విభాగం, ఆర్‌ఎంసీ ప్రాంతాలను ఆర్వోలతో కలిసి సందర్శించారు.

సాయుధ బలగాల కవాతు ప్రదర్శన



సామర్లకోట, ఏప్రిల్ 1: ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేందుకు అన్ని భద్రతా చర్యలు చేపట్టినందున ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చని భరోసా కల్పిస్తూ వేట్లపాలెం గ్రామ పురవీధుల్లో సాయుధ బలగాలు పోలీసు కవాతు ప్రదర్శన సోమవారం నిర్వహించారు. 200మంది సాయుధ బలగాలు గ్రామ వీధుల మీదుగా ప్రదర్శన నిర్వహించారు. ట్రైనీ డీఎస్పీ సాయి ఈశ్వర్, సామర్లకోట ఎస్ఐ మౌనిక, ఏఎస్ఐ వెంకటరత్నం, పీసీ విజయరామరాజు పాల్గొన్నారు.

భీమేశ్వర స్వామికి విశేష పూజలు

సామర్లకోట, ఏప్రిల్ 1: సామర్లకోట భీమేశ్వరాలయంలో సోమవారం తెల్లవారుజామునుంచీ విశేషపూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరవర్మ, చెరుకూరి రాంబాబు, వెంకన్న, శ్రీనివాసరావు, అంజిబాబు, వినయ్‌లతో వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి వారికి విశేష అభిషేక పూజలు నిర్వహించారు. బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచీ అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు.